విలీన గ్రామాలపై చిన్నచూపు

- డ్రెయినేజీలు కూడా లేని వార్డులు
- కంపుకొడుతున్న కాలనీలు
- ప్రతిపక్షాల వార్డుల్లో అభివృద్ధి పనులు నత్తనడక
- పట్టించుకోని అధికారులు

వేములవాడరూరల్: మున్సిపాలిటీలో విలీనమైన గ్రామాలపై అధికారులు చిన్నచూపు చూస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. నగర పంచాయతీగా ఉన్న వేములవాడను ప్రభుత్వం మున్సిపాలిటీగా మార్చి, ఐదు గ్రామాలను విలీనం చేస్తూ గెజిట్ ప్రకటించింది. దీంతో గ్రామ పంచాయతీలుగా ఉన్న శాత్రాజుపల్లి, అయ్యోరుపల్లి, కోనాయపల్లి, తిప్పాపూర్, నాంపల్లి గ్రామాలను మున్సిపాలిటీలో కలిపారు. ఈ గ్రామాలను మున్సిపాలిటీలో కలపవద్దని గ్రామస్తులు కోర్టును కూడా ఆశ్రయించినా, ప్రభుత్వం మున్సిపాలిటీలో తప్పనిసరి కలపాల్సి వచ్చింది.

ఆశలు అడుగంటాయి..

ఇక ఈ గ్రామాలు మున్సిపాలిటీలో కలిస్తే అభివృద్ధికి అడుగులు పడుతాయని ఆ గ్రామాల ప్రజలు ఎంతగానో ఆశపడ్డారు. కానీ ఇప్పటివరకు ఈ


శాత్రాజుపల్లిలో డ్రెయినేజీ లేని వార్డు

విలీన గ్రామాల్లో డ్రెయినేజీలు కూడా పూర్తిస్థాయిలో నిర్మించలేదనే ఇక్కడి ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికీ ఎంతోమంది మున్సిపల్ కమిషనర్లు వస్తూ పోతున్నారే తప్ప, ఈ గ్రామాలపై ప్రత్యేక ప్రణాళికను సిద్ధం చేయడం లేదని వార్డు ప్రజలు ఆరోపిస్తున్నారు. కొంతవరకు రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణాలు చేసినప్పటికీ ఇంకా పూర్తిస్థాయిలో మాత్రం పనులు పూర్తి కాలేదనే అంటున్నారు. మున్సిపాలిటీలో కలిపి నాలుగేళ్లు కావస్తున్నా ఇప్పటికీ కొన్ని వార్డుల్లో డ్రెయినేజీ లేక వర్షాకాలం కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. కొన్నేళ్ల క్రితం గ్రామ పంచాయతీగా ఉన్న సమయంలో నిర్మించే డ్రెయినేజీలు నేటికీ అవే కొనసాగుతున్నాయి. రోజురోజుకు జనాభా పెరిగి వార్డులు పెరుగుతున్నా డ్రెయినేజీలు నిర్మాణం చేయడంలో నిర్లక్ష్యం చేస్తున్నారు. ఏ చిన్నపాటి వర్షం వచ్చినా డ్రెయినేజీలు నీటితో నిండి దుర్వాసన వస్తోంది.

ఆ వార్డులను పట్టించుకోరు

ఈ గ్రామాల నుంచి మొదటిసారి కౌన్సిలర్‌గా గెలిచిన ఐదుగురు కౌన్సిలర్లు ఈ వార్డుల్లో అభివృద్ధి జరగాలని తన పేరు చిరస్థాయిగా నిలవాలని పలు సందర్భాల్లో మున్సిపల్ సమావేశాల్లో అధికారులకు మొరపెట్టుకున్నా ఆశించినంత ఫలితం లేదు. సర్పంచులుగా ఉన్న ఈ గ్రామాల్లో కౌన్సిలర్లుగా వార్డుల అభివృద్ధి కోసం ప్రత్యేక నిధులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అయినా వేములవాడ పట్టణానికి ఇచ్చిన ప్రాధాన్యత తమ వార్డులకు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పదవీకాలం పూర్తయ్యేందుకు సమయం దగ్గర పడుతుండడంతో తాము ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో నెరవేర్చలేకపోతున్నామని అసంతృప్తి, ఆవేదన వ్యక్తమవుతోంది. ఇప్పటికైనా ఎమ్మెల్యే రమేశ్‌బాబు, జిల్లా అధికారులు, మున్సిపల్ అధికారులు విలీన గ్రామాలపై ప్రత్యేక నిధులు కేటాయించి వార్డుల అభివృద్ధికి కృషి చేయాలని ఈ వార్డు ప్రజలు కోరుతున్నారు.

పక్షపాతం చూపిస్తున్నారు


వేములవాడ మున్సిపాలిటీలో ఉన్న ప్రతిపక్ష పార్టీలకు చెందిన కౌన్సిలర్ ప్రాతినిధ్యం వహిస్తున్న వార్డులపై పక్షపాతం చూపుతున్నారు. ఆయా వార్డులకు నిధులు ఇవ్వడం లేదు. అధికార పార్టీకి చెందిన వార్డులకు మాత్రం అధిక నిధులు కేటాయిస్తున్నారు.

– సంగ స్వామి, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు, 1వ వార్డు

పనులు జరగడం లేదు


నిధులు మంజూరైనా పనులు జరగడం లేదు. ఆ వార్డుల్లో పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ సకాలంలో పనులు ప్రారంభించడం లేదు. ఈ విషయంలో అధికారులు, కాంట్రాక్టర్ నిర్లక్ష్య ధోరణి కారణం. వెంటనే పనులు పూర్తయ్యేలా చూడాలి.

– గడ్డమీది లావణ్య, 13వ వార్డు కౌన్సిలర్, వేములవాడ

త్వరలో పనులు పూర్తి చేస్తాం


మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల్లో సమానంగా అభివృద్ధి జరుగుతోంది. వార్డులకు కేటాయించిన నిధులతో ఆగిపోయిన పనులపై సంబంధిత కాంట్రాక్టర్లతో మాట్లాడాం. త్వరలోనే పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నాం.

– అన్సారీ, మున్సిపల్ కమిషనర్, వేములవాడ

క్లుప్తంగా

పోషకాహారంపై అవగాహన


పోషకాహారం అందజేస్తున్న టీచర్లు

వేములవాడరూరల్/చందుర్తి: పోషణ్ అభియాన్‌లో భాగంగా వేములవాడ మున్సిపల్ పరిధిలోని 1వ వార్డులోని అంగన్‌వాడీ సెంటర్‌లో పోషకాహారాలపై అవగాహన కార్యక్రమం, చందుర్తి మండలంలోని మూడపల్లి, ఎన్గల్, బండపల్లి, మర్రిగడ్డ, మల్యాల, సనుగుల గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించారు. పిల్లలకు, గర్భవతులకు, బాలింతలకు ఎలాంటి ఆహారం తీసుకోవాలి. వాటి వల్ల వచ్చే పోషకాలపై వివరించారు. కార్యక్రమాల్లో కౌన్సిలర్ సంగ హన్మవ్వ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శంకరమ్మ, అంగన్‌వాడీ టీచర్లు జ్యోతి, అరుణ, లక్ష్మీనర్సింహ, జ్యోతి, మంజుల, స్వప్న, రేణుక, పద్మ, తల్లుల కమిటీ సభ్యులు, ఆశావర్కర్లు నీరజ, ఏఎన్‌ఎమ్ దీపిక పాల్గొన్నారు.

స్థలాన్ని కేటాయించండి


ఆర్డీవోకు వినతిపత్రాన్నిస్తున్న మాజీ ఎంపీపీ,

చందుర్తి: రైతులు పండించిన ధాన్యాన్ని ఆరబెట్టుకునేందుకు స్థలాన్ని కేటాయించాలని మాజీ ఎంపీపీ, మండల రైతు సంక్షేమ సంఘం అధ్యక్షుడు చిలుక పెంటయ్య ఆధ్వర్యంలో రైతులు కలెక్టర్ అనురాగ్ జయంతి, వేములవాడ ఆర్డీవో పవన్‌కుమార్‌కు బుధవారం వినతిపత్రాన్ని సమర్పించారు. చందుర్తి శివారులోని మోతుకులరావుపేట వెళ్లే దారిలో ఉన్న కొత్తహన్మండ్ల దేవాలయం శివారులో గల 15 ఎకరాలు, 176వ సర్వే నెంబర్‌లో 300 ఎకరాల ప్రభుత్వ భూమి, బోడగుట్ట వద్ద ఉన్న ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురైనట్లు వినతిపత్రంలో పేర్కొన్నారు. కబ్జాకు గురైనా ప్రభుత్వ భూమిని సర్వే చేయించి, పంటలను ఆరబెట్టుకునేందుకు స్థలాన్ని కేటాయించాలని కోరారు. వార్డు సభ్యులు లింగంపల్లి అజయ్, రైతులు మర్రి రాజు, మల్లేశం, మల్లేశం పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ చేపట్టాలి


చౌరస్తాలో నిరసన తెలుపుతున్న నాయకులు

సిరిసిల్లటౌన్: ఎస్సీ వర్గీకరణ వెంటనే చేపట్టాలని ఎమ్మార్పీఎస్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా కన్వీనర్ బెజ్జంకి అనిల్ డిమాండ్ చేశారు. బుధవారం సిరిసిల్ల అంబేద్కర్ చౌరస్తాలో నిరసన తెలిపి మాట్లాడారు. ఏడు దశాబ్దాలుగా ఎస్సీ రిజర్వేషన్లకు ఏకపక్షంగా దోచుకుంటున్న వర్గాలకు కేంద్ర సర్కారు తొత్తుగా నిలుస్తోందని ఆరోపించారు. ఎస్సీ వర్గీకరణలో చట్టబద్ధత కోసం ఎమ్మార్పీఎస్ పాదయాత్ర చేపట్టిందన్నారు. దేశంలో అధికారంలోకి వచ్చాక వంద రోజుల్లోనే ఎస్సీ వర్గీకరణ చేపడుతామని ఇచ్చిన హామీని బీజేపీ సర్కారు నిలబెట్టుకోవడం లేదన్నారు. వెంటనే పార్లమెంటులో వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు గుండా థామస్, దేవరాజు, ఆంజనేయులు, ప్రభాకర్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

పదేళ్ల బంధానికి వీడ్కోలు


ముస్తాబాద్: ఆవునూర్‌లో విద్యార్థుల నృత్యాలు


వేములవాడరూరల్: హన్మాజీపేటలో

జిల్లాలోని పలు పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమాలు బుధవారం నిర్వహించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. పదేళ్లుగా ఒకే పాఠశాలలో చదువుకొని వీడిపోతున్న ఈ తరుణంలో విద్యార్థుల కళ్లు చెమ్మగిల్లాయి. ముస్తాబాద్ బాలికల ఉన్నత పాఠశాల, వేములవాడరూరల్ మండలం హన్మాజీపేట, వీర్నపల్లి జెడ్పీహెచ్‌ఎస్, కోనరావుపేట మండలం సుద్దాల, కనగర్తి, ధర్మారం, గంభీరావుపేట మండలం దమ్మన్నపేట, కొత్తపల్లి, ఎల్లారెడ్డిపేటలో నిర్వహించిన కార్యక్రమాల్లో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్యతో పాటు ప్రజాప్రతినిధులు, నాయకులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

– ముస్తాబాద్/బోయినపల్లి/వీర్నపల్లి/కోనరావుపేట/గంభీరావుపేట/ఎల్లారెడ్డిపేట

సైబర్ మోసాలపై అవగాహన సదస్సులు

ఇల్లంతకుంట/వేములవాడరూరల్/కోనరావుపేట/గంభీరావుపేట/కోనరావుపేట: జిల్లాలోని పలు గ్రామాల్లో, విద్యా సంస్థల్లో బుధవారం సైబర్ నేరాలపై అవగాహన సదస్సులు నిర్వహించారు. బ్యాంకుల నుంచి ఫోన్ చేస్తున్నామని చెప్పి, ఏటీఎం పాస్‌వర్డ్, బ్యాంక్ అకౌంట్, ఆధార్ నెంబర్లు అడిగే అపరిచిత కాల్స్‌తో అప్రమత్తంగా ఉండాలని, ఫోన్లలో ఎలాంటి వ్యక్తిగత వివరాలు చెప్పొద్దన్నారు. ఫేస్‌బుక్, వాట్సాప్‌ల ద్వారా వచ్చే అపరిచిత మెసేజ్‌లకు స్పందించొద్దన్నారు. ఇల్లంతకుంట మండలంలోని దాచారం గ్రామంలో ఎస్సై రాజేశ్, వేములవాడరూరల్ మండలంలోని నూకలమర్రి ఉన్నత పాఠశాలలో కానిస్టేబుల్ రాజశేఖర్ ఆధ్వర్యంలో, గంభీరావుపేట, కోనరావుపేట పాఠశాలల్లో సైబర్ అంబాసిడర్ ప్లాట్‌ఫామ్ కింద అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా సెక్టోరియల్ ఆఫీసర్ పద్మజ, ప్రధానోపాధ్యాయులు, కేజీబీవీ ప్రత్యేకాధికారు, సైబర్ అంబాసిడర్ మెంటర్ టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.


గంభీరావుపేట: ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ఇల్లంతకుంట: రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. మండలంలోని పొత్తూరులో సింగిల్‌విండ్ చైర్మన్ రొండ్ల తిరుపతిరెడ్డి అధ్యక్షతన బుధవారం నిర్వహించిన ఇల్లంతకుంట పీఏసీఎస్ సర్వసభ్య సమావేశం సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో ప్రభుత్వం అందిస్తున్న పథకాలను వివరించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రైతులకు రుణమాఫీ త్వరలోనే చేస్తారన్నారు. యాసంగి ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయబోతుందని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. సహకార సంఘం ద్వారా తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించి సంఘం అభివృద్ధికి రైతులు కృషి చేయాలన్నారు. జెడ్పీ వైస్‌చైర్మన్ సిద్దం వేణు, ఎంపీపీ వెంకటరమణారెడ్డి, పీఏసీఎస్ వైస్‌చైర్మన్ తిరుపతి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు నర్సింహారెడ్డి, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు చల్ల నారాయణ, సర్పంచులు, సీఈవో రవిందర్‌రెడ్డి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

కల్యాణానికి ముస్తాబైన ఆలయాలు


ముస్తాబైన బోయినపల్లి రామాలయం


కోనరావుపేట: చలువ పందిరి వేస్తున్న దృశ్యం

ముస్తాబాద్/వేములవాడఅర్బన్/బోయినపల్లి/కోనరావుపేట: శ్రీరామ నవమి సందర్భంగా గురువారం నిర్వహించే శ్రీసీతారామచంద్రస్వామి కల్యాణ వేడుకలకు ఆలయాలు ముస్తాబయ్యాయి. విద్యుత్ దీపాలతో ఆలయాలను అలంకరించారు. కల్యాణం తిలకించేందుకు వచ్చే భక్తుల కోసం చలువ పందిళ్లు వేశారు. భక్తుల సౌకర్యార్థం మంచినీటి సౌకర్యం, అన్నదానం కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ముస్తాబాద్ మండలంలో ఆవునూర్, పోతుగల్ హన్‌మాన్ ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిద్దిదారు. నామాపూర్, గూడెంలోని శ్రీలక్ష్మి వెంకటేశ్వరస్వామి ఆలయం, మద్దికుంటలో శ్రీవేణుగోపాలస్వామి, వేములవాడ మండలం అగ్రహారం హనుమాన్ దేవాలయంలో, వేములవాడ మండలంలోని అనుపురం, రుద్రవరం, ఆరెపల్లి, బోయినపల్లి శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంతో పాటు వెంకట్రావుపల్లి, నీలోజిపల్లి, నర్సింగాపూర్, విలాసాగర్, కోనరావుపేట మండలంలోని మామిడిపల్లి శ్రీసీతారామచంద్ర స్వామి ఆలయంలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. అలాగే నాగారం, మర్తనపేట, ధర్మారం, కోనరావుపేట, నిమ్మపల్లి, కనగర్తి, కొలనూర్‌లో ఉత్సవాలు నిర్వహిస్తున్నారు.

సంక్షిప్త వార్తలు

కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభం

గంభీరావుపేట: మండలం కొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్‌ను ఎంపీపీ వంగ కరుణ బుధవారం ప్రారంభించారు.

డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా విజయలక్ష్మి

గంభీరావుపేట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ వి. విజయలక్ష్మి బుధవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. న్యాక్ బృందం సందర్శనకు అందరూ సమన్వయంతో వ్యవహరించి కళాశాల ఉన్నత గ్రేడ్ సాధించేందుకు కృషి చేయాలని కోరారు.

కంటి వెలుగు శిబిరం ప్రారంభం

వీర్నపల్లి: మండలం లోని బావుసింగ్ తండా గ్రామంలో కంటి వెలుగు శిబిరాన్ని సర్పంచ్ భుక్య సుజాత ప్రారంబించారు. ఉపసర్పంచ్ రాజు నాయక్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ

గంభీరావుపేట: మండల కేంద్రంలో పలువురు లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను సర్పంచ్ కటకం శ్రీధర్‌పంతులు బుధవారం పంపిణీ చేశారు. బీఆర్‌ఎస్ పట్టణశాఖ అధ్యక్షుడు వెంకటి యాదవ్, కో ఆప్షన్ సభ్యుడు అహ్మద్ పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: మండలం రాచర్లగుండారంలో లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను బుధవారం సర్పంచ్ భూక్య శంకర్ పంపిణీ చేశారు.

పరీక్షా సామగ్రి అందజేత

కోనరావుపేట: మండలం సుద్దాల ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఎంపీటీసీ కాశవేణి మమత మహేశ్ పరీక్ష సామగ్రి అందజేశారు.

ట్రాన్స్‌ఫార్మర్‌కు శంకుస్థాపన

ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాజన్నపేటలో బుధవారం నూతన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ నిర్మాణానికి సెస్ డైరెక్టర్ వరుస కృష్ణహరి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ పిల్లి రేణుక, సర్పంచ్ శంకర్, సింగిల్‌విండో చైర్మన్ కృష్ణారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ఆలయానికి రూ.20 వేలు విరాళం

తంగళ్లపల్లి: స్థానిక శ్రీరామ, హనుమాన్ ఆలయానికి ఉపసర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు తిరుపతి రూ.20 వేలు విరాళం అందజేశారు.

వడ్డీ మాఫీ ప్రొసీడింగ్ కాపీలు అందజేత

ఎల్లారెడ్డిపేట: మండలంలోని సింగారంలో 21 మహిళా సంఘాలకు రూ.5.38 లక్షల వడ్డీ మాఫీ ప్రొసీడింగ్ కాపీలను సర్పంచ్ నర్సాగౌడ్ బుధవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఉస్మాన్, వార్డు సభ్యులు, సీసీ పద్మ, సీఏ లావణ్య, మహిళ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

పట్టణాభివృద్ధిపై దృష్టి సారించండి

- వేములవాడ ఎమ్మెల్యే రమేశ్‌బాబు

వేములవాడ: వేములవాడ పట్టణాభివృద్ధిపై అధికారులు దృష్టి సారించాలని ఎమ్మెల్యే రమేశ్‌బాబు అన్నారు. సంగీత నిలయంలో బుధవారం రెవెన్యూ, హౌసింగ్, ఆర్‌అండ్‌బీ, మున్సిపల్ శాఖ అధికారులతో ప్రత్యేక సమావేశమై మాట్లాడారు. పట్టణంలో 1200 డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మించేందుకు స్థల సేకరణ చేయడంతో పాటు లబ్ధిదారుల ఎంపికపై దృష్టి సారించాలన్నారు. మొదటి దఫా బ్రిడ్జి నుంచి రాజన్న గుడి వరకు చేపట్టబోతున్న రోడ్డు విస్తరణకు సంబంధించిన సర్వే వివరాలు ఏప్రిల్‌లోగా అందజేయాలన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, ఆర్డీవో పవన్‌కుమార్, జిల్లా హౌసింగ్ పీడీ భాస్కర్, మున్సిపల్ కమిషనర్ అన్సారీ, ఎమ్మార్వోలు రాజారెడ్డి, ఎండీ మజీద్, ఆర్‌అండ్‌బీ డిప్యూటీ ఈఈ శాంతయ్య, ఏఈ సతీశ్ పాల్గొన్నారు.

పనితీరు మెరుగుపర్చుకోవాలి


సెర్ప్ ఉద్యోగులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమేశ్‌బాబు

క్షేత్రస్థాయిలో పనిచేసే సెర్ప్ ఉద్యోగులు తమ పనితీరును మరింత మెరుగు పరచుకోవాలని ఎమ్మెల్యే రమేశ్‌బాబు అన్నారు. సెర్ప్ ఉద్యోగులతో బుధవారం సమావేశమయ్యారు. దళితబంధు వంద యూనిట్లను పేదరికంలో ఉన్నవారికి మాత్రమే ఇచ్చామన్నారు. మరో 1100 యూనిట్లు త్వరలో మంజూరు కాబోతున్నాయన్నారు. మూడు వేల మందికి ఇళ్లు నిర్మించుకునేందుకు రూ.3 లక్షల చొప్పున కేటాయించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ గడ్డం హన్మండ్లు, సెర్ప్ ఉద్యోగుల జిల్లా అధ్యక్షుడు రాడం చంద్రయ్య, సీసీ అధ్యక్షుడు సూదుల రాజు, ఎంఎస్‌సీసీ వెన్నం శోభారాణి, అడ్మిన్ అసిస్టెంట్ అధ్యక్షురాలు కస్తూరి జ్యోతి, ఉద్యోగులు పాల్గొన్నారు.

నిరంతరం సేవలందిస్తాం

కోనరావుపేట: రైతులకు నాణ్యమైన సేవలు నిరంతరం అందిస్తున్నామని సింగిల్‌విండో చైర్మన్ సంకినేని రాంమోహన్‌రావు అన్నారు. బుధవారం నిర్వహించిన కొలనూర్ సింగిల్‌విండో సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటి వరకు 3,454 మంది రైతులు సభ్యులుగా ఉన్న సంఘంలో రూ.70.96 లక్షల వాటాధనము సమకూరిందన్నారు. పంట రుణాలు, ఇతర రుణాలు అందిస్తున్నట్లు తెలిపారు. గత ఖరీఫ్ సీజన్‌లో 9 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి 76,533 క్వింటాళ్ల ధాన్యాన్ని కొనుగోలు చేసి డబ్బులను రైతుల ఖాతాల్లో జమ చేశామన్నారు. మండలంలోని సుద్దాల, ధర్మారం, నాగారం గ్రామాల్లో ఎరువుల గోదాములు, కార్యాలయ భవనాలను ఏర్పాటు చేస్తామన్నారు. రైతులకు అవసరమైన విత్తనాలను కూడా సకాలంలో అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ కాశవేణి మహేశ్, సీఈవో గాజుల అమర్, డైరెక్టర్లు పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణ

తంగళ్లపల్లి: మండల స్థాయిలో మూడు రోజుల పాటు సాగిన స్వచ్ఛ భారత్ మిషన్ శిక్షణా కార్యక్రమం బుధవారం ముగిసింది. ఈ సందర్భంగా మూడు రోజులపాటు ఇచ్చిన శిక్షణను ఆచరణలో పెట్టి గ్రామాల అభివృద్ధికి ముందుకు సాగాలని ఎంపీపీ పడిగెల మానస అన్నారు. సర్పంచ్ పోచయ్య, ఎంపీడీవో పి.లచ్చాలు, ఎస్‌బీఎం సురేశ్, టీఏలు లక్ష్మణ్, మనోహర్ పాల్గొన్నారు.

సమాచారం

రేపు మున్సిపల్ సమావేశం

సిరిసిల్లటౌన్: పురపాలక సంఘం సాధారణ సమావేశాన్ని ఈనెల 31 నిర్వహిస్తున్నట్లు సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్ వెల్దండి సమ్మయ్య ఒక ప్రకటనలో తెలిపారు. కార్యాలయంలోని కౌన్సిల్ సమావేశం మందిరంలో ఉదయం 11 గంటలకు చైర్‌పర్సన్ జిందం కళ అధ్యక్షతన జరిగే సమావేశానికి కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

వ్యక్తుల బైండోవర్


బైండోవర్ చేస్తున్న ఎక్సైజ్ అధికారులు

వీర్నపల్లి: మండలంలోని రాశిగుట్ట తండా, రంగంపేట, వన్‌పల్లి, శాంతినగర్‌లో బుధవారం దాడులు నిర్వహించి గుడుంబా అమ్ముతున్న లకావత్ సరిత, లకావత్ మేనీ, లకావత్ అంబీ, మాలోత్ గిరిజను తహసీల్దార్ తఫాజుల్ హుస్సేన్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎక్సైజ్ సీఐ చంద్రశేఖర్ తెలిపారు. డిప్యూటీ తహసీల్దార్ ప్రవీణ్, ఎస్సై శైలజ, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు శాస్త్రీయ అవగాహన కలిగి ఉండాలి


మాట్లాడుతున్న వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్

వేములవాడఅర్బన్: విద్యార్థులు శాస్త్రీయ అవగాహన కలిగి ఉండాలని అగ్రహారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ తిరుకోవెల శ్రీనివాస్ అన్నారు. మండలంలోని మారుపాకలో కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ ప్రత్యేక శిబిరంలో ఆయన మాట్లాడారు. జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు గుర్రం అంజనేయులు, జిల్లా ప్రధానకార్యదర్శి సంపతి రమేశ్, కళాశాల అధ్యాపకులు నీలం శ్రీనివాసులు, నారాయణ. దీపిక, ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణకు నోటీసులు జారీ

ఎల్లారెడ్డిపేట: రోడ్డు విస్తరణలో భాగంగా ఎల్లారెడ్డిపేట పంచాయతీ పరిధిలోని కిషన్‌దాస్‌పేటలో గంప రాజేశం ఇంటి నుంచి కిష్టంపల్లి వరకు గృహ యజమానులకు పంచాయతీ కార్యదర్శి దేవరాజు బుధవారం నోటీసులు జారీ చేశారు. రోడ్డు ఇరుకుగా ఉండడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నట్లు వార్డు సభ్యులు, సర్పంచ్ నేవూరి వెంకట్‌రెడ్డి, ఉపసర్పంచ్ ఒగ్గు రజిత దృష్టికి తీసుకువచ్చారు. దీంతో గ్రామసభ నిర్వహించి 30 ఫీట్ల రోడ్డు విస్తరణ పనులు ఏప్రిల్ 20 లోగా పూర్తి చేయాలని తీర్మానించారు. రోడ్డుకిరువైపులా మార్కింగ్ కూడా పూర్తయ్యింది. అయితే నోటీసులు అందుకున్న ఇంటి యాజమానులు మాత్రం ఇళ్ల తొలగింపు ససేమిరా అంటున్నారు.

పీఎంఎన్‌ఆర్‌ఎఫ్ సాయం ఏనాడైనా అందించారా?

ముస్తాబాద్: బీజేపీ నాయకులు ఏనాడైనా కేంద్రం అందించే ప్రధానమంత్రి సహాయనిధి (పీఎంఎన్‌ఆర్‌ఎఫ్) నుంచి ఒక్కరికైనా రూపాయి అందించారా అని రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు కల్వకుంట్ల గోపాల్‌రావు ప్రశ్నించారు. ముస్తాబాద్, ఆవునూర్ గ్రామాల్లో సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను బుధవారం బాధిత కుటుంబాలకు అందించారు. ఈ సందర్భంగా గోపాల్‌రావు మాట్లాడుతూ మంత్రి కేటీఆర్ ద్వారా జిల్లాలో వేలాది మందికి కోట్లాది రూపాయల సాయం అందించామన్నారు. కరీంనగర్ ఎంపీ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ద్వారా బీజేపీ నాయకులు ఆపదలో ఉన్న వారిని ఒక్కరినైనా ఆదుకున్నారా అని ప్రశ్నించారు. సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, జెడ్పీటీసీ నర్సయ్య, బీఆర్‌ఎస్ మండల, పట్టణ అధ్యక్షులు సురేందర్‌రావు, నర్సింహరెడ్డి, పాల్గొన్నారు.

మొదలైన బ్రహ్మోత్సవాలు

కోనరావుపేట: మండలం మామిడిపల్లి శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. బుధవారం అంకురార్పణం, అభిషేకం, స్థాపిత దేవతార్చన, ధ్వజారోహణం నిర్వహించారు. కార్యక్రమాల్లో సర్పంచ్ కొక్కుల భారత, ఉపసర్పంచ్ ఎల్లాల రాంరెడ్డి పాల్గొన్నారు.